క్లుప్తంగా

కరపత్రాల ఆవిష్కరణ



నర్మెట : సేవాలాల్ సేన ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధరావత్ రమేశ్ పిలుపునిచ్చారు. ఈనెల 14న జనగామ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న 11వ ఆవిర్భావ దినోత్సవ వేడుక సందర్భంగా మండల కేంద్రంలోని చౌరస్తాలో బుధవారం కరపత్రాలను ఆవిష్కరించారు. భీంసింగ్ నాయక్, అశోక్, బాల్‌సింగ్, శంకర్, వీరు, దేవేందర్, రాజేందర్, నర్సింహ, మంజ్యా, రామకృష్ణతో పాటు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ



పాలకుర్తి : మండలంలోని 36గ్రామ పంచాయతీలకు 576 యూనిట్ల యూరియా పంపిణీ చేశామని, ఇంకా 400 మెట్రిక్ టన్నుల యూరియా ఈ నెలఖారులోగా రానుందని వ్యవసాయ శాఖ అధికారి శరత్‌చంద్ర బుధవారం తెలిపారు. కాగా ముత్తారం పరిధిలో యూరియా పంపిణీ కేంద్రాల్లో రైతులు గొడవ పడ్డారు. ఎఫ్‌సీఎస్ పాలకుర్తి, తొర్రూరు పీఏసీఎస్, విస్నూరు, చెన్నూరు, గూడూరు, ముత్తారం గ్రామాల్లోని రైతువేదిక కేంద్రాల్లో యూరియా పంపిణీ చేస్తామని వివరించారు.

తీరని యూరియా కష్టాలు

స్టేషన్‌ఘన్‌పూర్ : ఘన్‌పూర్ ఆగ్రోస్ సెంటర్‌కు 222 బస్తాల యూరియా స్టాక్ బుధవారం రాగానే పంపిణీ చేశారు. యూరియా స్టాక్ వచ్చిన సమాచారంతో వివిధ గ్రామాల నుంచి రైతులు ఉదయం వరకే అధికసంఖ్యలో చేరుకుని క్యూలో నిల్చున్నారు. పోలీసు బందోబస్తు మధ్య ఏఓ చంద్రన్‌కుమార్ పర్యవేక్షణలో యూరియా పంపిణీ చేపట్టారు. కాగా యూరియా బస్తా ఒక్కటి రూ.267లకు విక్రయించాల్సి ఉండగా రూ.280 నుంచి రూ.300 వరకు విక్రయిస్తున్నారని రైతులు వాపోతున్నారు.

రైతుల వాగ్వాదం

స్టేషన్‌ఘన్‌పూర్ ఆగ్రోస్ సెంటర్ వద్దకు చిల్పూరు మండలం నుంచి చాలా మంది రైతులు రావడంతో పక్క మండలాల వారికి ఎలా యూరియా పంపిణీ చేస్తారంటూ ఘన్‌పూర్ మండలానికి చెందిన రైతులు ఏఓతో, ఆగ్రోస్ నిర్వాహకుడితో వాగ్వాదం చేశారు. ఈ క్రమంలో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. దీంతో ఏఓ చంద్రన్‌కుమార్ చిల్పూరు మండల ఏఈఓలను అక్కడకు పిలిపించి వారితో రైతులకు సమాధానం చెప్పించారు. చిల్పూరు మండల రైతులకు టోకెన్లు అందించి నచ్చచెప్పి పంపించారు. అనంతరం యథావిధిగా యూరియా పంపిణీ చేపట్టారు.

మరమ్మతు ఎప్పుడో..!



రేకులు ఎగిరిపోయిన ఖిలాషాపూర్ రైతు వేదిక



నిరుపయోగంగా ఉన్న కుర్చీలు, బీరువా, ఇతర సామగ్రి

గాలిదుమారానికి ఎగిరిపోయిన ఖిలాషాపూర్ రైతువేదిక రేకులు

- ఎండకు ఎండుతూ, వానకు తడుస్తున్న సామగ్రి
- పట్టించుకోని అధికారులు

రఘునాథపల్లి : పంటలు సాగుచేసిన రైతులకు అవగాహన కల్పించేందుకు మండలంలోని ఖిలాషాపూర్‌లో నిర్మించిన రైతు వేదిక గాలిదుమారానికి పై కప్పు రేకులు లేచిపోయాయి. నాలుగు నెలలుగా మరమ్మతుకు నోచుకోక పోవడంతో నిరుపయోగంగా మారింది. దీంతో అందులోని కుర్చీలు, బీరువా, టేబుల్స్, సీలింగ్ ఫ్యాన్లు, ఇతర సామగ్రి ఎండకు ఎండుతూ, వానకు తడుస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రతి ఐదువేల ఎకరాలకు ఒక క్లస్టర్ చొప్పున బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.22లక్షలతో రైతు వేదిక భవనాన్ని నిర్మించారు. నిర్మాణ సమయంలో పనులు నాసిరకంగా చేపట్టడంతోనే గాలిదుమారానికి రేకులు ఎగిరిపోయాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి రైతు వేదికకు మరమ్మతు చేసి వినియోగంలోకి తీసుకు రావాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై మండల వ్యవసాయధికారి కాకి శ్రీనివాస్‌రెడ్డిని వివరణ కోరగా నాలుగు నెలల క్రితం గాలి దుమారాలకు పై కప్పు రేకులు ఎగిరిపోయి నిరుపయోగంగా ఉందన్నారు. రైతు వేదిక మరమ్మతు కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమస్యను మరోసారి అధికారులకు వివరిస్తానని తెలిపారు.

వడ్డె ఓబన్న చరిత్ర చిరస్మరణీయం

- విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



ఓబన్న విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి తదితరులు

పాలకుర్తి టౌన్ : స్వాతంత్య్ర సమరయోధుడు వడ్డె ఓబన్న చరిత్ర చిరస్మరణీయమని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని శ్రీసోమేశ్వరాలయం ఆర్చి ఎదుట వడ్డె ఓబన్న విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా రైతుల హక్కుల కోసం పోరాడిన తొలి స్వాతంత్య్ర సమరయోధుడు ఓబన్న అని అన్నారు. ఓబన్న ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి వ్యక్తిగత సైనికుడిగా ఉండి, బ్రిటిషు వారిపై జరిపిన పోరాట పటిమ స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందన్నారు. సమావేశంలో తెలంగాణ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లెపు మొగిలి, ముద్దంగుల భాగ్యలక్ష్మి, మండల నాయకులు శివరాత్రి కొమురయ్య, బొమ్మెశెట్టి ఎల్లష్, సోమనర్సయ్య, కుమార్, వల్లెపు యాదగిరి, కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణ పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 56 మంది లబ్ధిదారులకు బుధవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి పంపిణీ చేశారు. కాగా మండలంలోని మేకలతండాకు చెందిన బాదావత్ తిరుపతి అనారోగ్యానికి గురికాగా చికిత్స నిమిత్తం బాధిత కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల ఎల్‌ఓసీని అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ లావ్యుడి మంజుల, కాంగ్రెస్ నాయకులు రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, బండిపల్లి మణెమ్మ, ఎర్రబెల్లి రాఘవరావు, యాకాంతరావు, పులి గణేష్, కారుపోతుల శ్రీనివాస్, ఎండీ మదార్ తదితరులు పాల్గొన్నారు.

సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్



సభలో మాట్లాడుతున్న ఎండీ అబ్బాస్

జఫర్‌గఢ్ : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి వారసులు కమ్యూనిస్టులేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్ పేర్కొన్నారు. మండలంలోని తమ్మడపల్లి (జి) గ్రామంలో రెండ్రోజులపాటు నిర్వహించిన సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులు మంగళవారం రాత్రి ముగిశాయి. అనంతరం అమరవీరులను స్మరిస్తూ నిర్వహించిన బహిరంగ సభకు పార్టీ గ్రామ కార్యదర్శి వడ్లకొండ సుధాకర్ అధ్యక్షత వహించగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్, జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, రాపర్తి రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా అమరుల కుటుంబాలను వారు సన్మానించి, బహిరంగ సభలో ఎండీ అబ్బాస్, మోకు కనకారెడ్డి మాట్లాడారు. 1946 నుంచి 1951 వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం సాగిందన్నారు. అనాడు కమ్యూనిస్టులు పేదలకు 10 లక్షల ఎకరాల భూమిని పంచడంతో పాటు గ్రామ రాజ్యాలు స్థాపించారన్నారు. ఈ పోరాటంలో 4,000 మంది కమ్యూనిస్టులు తమ ప్రాణాలను త్యాగం చేశారని గుర్తు చేశారు. సాయుధ పోరాటంతో ఏమాత్రం సంబంధం లేని బీజేపీ పోరాటాన్ని వక్రీకరించేలా ప్రయత్నిస్తోందన్నారు. నాయకులు రాపర్తి సోమయ్య, ఎండీ షబానా, గుండెబోయిన రాజు, కాట సుధాకర్, ప్రజా నాట్యమండలి కళాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సకాలంలో వేతనాలు ఇవ్వాలి

బచ్చన్నపేట : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల ఉద్యోగులకు సకాలంలో వేతనాలు ఇవ్వాలని జీపీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర జేఏసీ మీడియా ఇన్‌చార్జ్ తేలుకంటి మురళి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎంపీడీఓ మమతాభాయ్‌ను కలిసి శాలువాలతో సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ..ఉద్యోగులను ఆన్‌లైన్ చేయకపోవడంతో వారికి వేతనాలు సక్రమంగా రాక నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కాళ్ల ప్రభాకర్, గొల్లపల్లి బాబుగౌడ్, కొంరెల్లి శ్రీనివాస్, నాగయ్య పలువురు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా మరియ జోసెఫ్

జనగామ: ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని జనగామ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా పట్టణంలోని నెహ్రూపార్క్ సెయింట్‌పాల్స్ ప్రధానోపాధ్యాయుడు మరియ జోసెఫ్ ఎంపికయ్యారు. బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల స్టాఫ్, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు, పలువురు విద్యావేత్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న మరియ జోసెఫ్

‘బడ్జెట్ కేటాయించకుండానే శంకుస్థాపన’



మాట్లాడుతున్న రాజేశ్ నాయక్

కొడకండ్ల : అసెంబ్లీ ఎన్నికల ముందు ఎలాంటి బడ్జెట్ కేటాయించకుండానే పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన వారిని ప్రసన్నం చేసుకోవడానికి మండల కేంద్రంలో మినీటెక్స్‌టైల్ పార్క్‌కు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శంకుస్థాపన చేశారని నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ రాజేశ్ నాయక్ ఆరోపించారు. బుధవారం మినీటెక్స్‌టైల్ పార్క్ శిలాఫలకం వద్ద విలేకరులతో ఆయన మాట్లాడారు. రూ.61.54 కోట్లు మంజూరైనట్లు ఎన్నికల కోడ్ వచ్చే ముందు హడావుడిగా శంకుస్థాపన చేసి పద్మశాలీలను మోసం చేశారని, ఎన్నికల్లో లబ్ధి పొందాలనుకున్న దయాకర్‌రావు జిమ్మిక్కులకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని తెలిపారు. వాస్తవాలు తెలుసుకోకుండా సోషల్ మీడియాలో బీఆర్ఎస్ శ్రేణులు అసత్య ప్రచారం చేయడం సిగ్గు చేటని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మసురం రవీందర్, భిక్షపతి, గఫూర్, యాకేష్ యాదవ్, వెంకన్న, సంజీవ, అనిల్, హరీష్, రమేష్, కనకయ్య, రమేష్, రాజు, విజయ్ పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశాలు

పాలకుర్తి : తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు 6,7,8,9 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని ములుగు జిల్లా అధికారి హరిసింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏటూరునాగారంలోని స్కూల్‌లో దేహదారుఢ్య, నైపుణ్య ప్రవేశ పరీక్షను 15వ తేదీన నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆదాయం, స్టడీ సర్టిఫికెట్ నాలుగు కలర్ ఫొటోలతో స్పోర్ట్స్ బాలుర స్కూల్‌లో హాజరు కావాలన్నారు.

కుట్రపూరితంగా కేసు

బచ్చన్నపేట : కావాలని కుట్రపూరింతగా కేసును పెట్టించారని మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామ నాయకులు తాతిరెడ్డి శశిధర్‌రెడ్డి, మైమూద్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ.. అత్యాచారం చేశారని కేసు పెట్టిన సదరు మహిళా మనుమడు ఇటీవల బైక్‌తో గేదెను ఢీకొనగా గ్రామస్తులంతా రూ.25 వేల జరిమానా విధించారని అన్నారు. అలాగే గ్రామంలో మైనర్లు వాహనాలను నడిపితే లక్ష రూపాయల జరిమానా అని గ్రామస్తులు తీర్మానం చేయడంలో మింగుడు పడడం లేదని చెప్పారు. పోలీసులు ఈవిషయమై గ్రామంలో విచారణ చేపట్టాలని కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

దేవరుప్పుల : మండలంలోని కడవెండి గ్రామ ట్రాక్టర్ యజమానుల అసోసియేషన్ నూతన కార్యవర్గం అధ్యక్షుడిగా కాశబోయిన యాకన్న ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా మల్లేష్, కార్యదర్శిగా ప్రభాకర్, కోశాధికారిగా బక్కాజీ ఎన్నికయ్యారు.

సంక్షిప్త సమాచారం

పరామర్శ

తరిగొప్పుల : మండల కేంద్రానికి చెందిన యాటెల్లి ఇస్లాక్, ఎర్రబుచ్చల సుజాత ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. కాగా బాధిత కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వగలబోయిన యాదగిరి, బైకని ట్రస్ట్ వ్యవస్థాపకుడు బైకని బాలరాజు యాదవ్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఇరు కుటుంబాలకు 50 కేజీల బియ్యం అందజేశారు.

దేవరుప్పుల : మండలంలోని చిన్నమడూరుకు చెందిన కాంగ్రెస్ నాయకుడు జనగామ రాజు అనారోగ్యానికి గురికాగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు పరామర్శించారు.

నివాళి

చిల్పూరు : స్వాతంత్య్ర సమరయోధుడు పెండ్యాల రాఘవరావు ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు పాటుపడాలని పలువురు పేర్కొన్నారు. మండలంలోని చిన్నపెండ్యాలలో బుధవారం రాఘవరావు వర్ధంతి సందర్భంగా గ్రామస్తులు ఆయన విగ్రహం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల సాయికిరణ్, తాళ్లపల్లి సమ్మయ్య, గజ్జెల దామోదర్, యాదగిరి, బుచ్చయ్య, రాజన్‌బాబు, రాజమౌళి, సురేష్ ఉన్నారు.

నేడు ఉపాధిహామీ ప్రజావేదిక

రఘునాథపల్లి : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలో చేపట్టిన పనులపై గురువారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు బుధవారం తెలిపారు. ఉదయం 10గంటలకు మండల పరిషత్ ఆవరణలో జరిగే ప్రజా వేదికకు మండలంలోని ఈజీఎస్ సిబ్బంది, కూలీలు, మాజీ ప్రజా ప్రతినిధులు సకాలంలో హాజరు కాగలరని కోరారు.

ఓటరు జాబితా ప్రదర్శించాలి



బచ్చన్నపేట : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఓటరు తుది జాబితాను ప్రదర్శించాలని ఎంపీడీఓ మమతాభాయ్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని కార్యాలయ ఆవరణలో జాబితాలను విడుదల చేసిన అనంతరం మాట్లాడారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు-2025కు సంబంధించి డ్రాఫ్ట్ ఓటరు, పోలింగ్ స్టేషన్ల ఏర్పాటును కూడా గుర్తించామన్నారు. అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఓటరు జాబితాలను తీసుకెళ్లాలని సూచించారు. ఎంపీఓ వెంకటమల్లికార్జున్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనాథ్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ పంకజం, నితిన్ పలువురు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సిద్ధం

కొడకండ్ల : మండలంలోని ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన ఓటరు జాబితాను బుధవారం అధికారులు ప్రకటించారు. మండల పరిషత్ నోటీసు బోర్డుపై ప్రాదేశిక ఎన్నికల పోలింగ్ కేంద్రాలు, ఫైనల్ ఓటరు జాబితాను ప్రదర్శించినట్లు ఎంపీడీఓ నాగశేషాద్రిసూరి తెలిపారు. ఎంపీఓ ఇందిర, సిబ్బంది పాల్గొన్నారు.

బచ్చన్నపేట: కేసిరెడ్డిపల్లిలో ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



పాలకుర్తి టౌన్: ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, ఐలమ్మ కుటుంబ సభ్యులు



పాలకుర్తి టౌన్: నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నవీన్‌కుమార్, నాయకులు



పోరాట యోధురాలు ఐలమ్మ

సాక్షి నెట్‌వర్క్ : భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం రజాకార్ల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రాణాలు ఎదురొడ్డి పోరాడిన చాకలి ఐలమ్మ పోరాటయోధురాలు అని పలువురు కొనియాడారు. బుధవారం జిల్లావ్యాప్తంగా చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐలమ్మ జీవితాన్ని అందరూ ఆదర్శంగా తీసుకొని, ఆమె ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రజక సంఘం, బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



జనగామ రూరల్: ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



దేవరుప్పుల: అంబేడ్కర్ చౌరస్తా వద్ద..



నర్మెటలో..



జఫర్‌గఢ్‌లో..



స్టేషన్‌ఘన్‌పూర్‌లో..



లింగాలఘణపురం: నివాళులర్పిస్తున్న ఎస్సై శ్రావణ్‌కుమార్, ఎంపీడీఓ రఘురామకృష్ణ



స్టేషన్‌ఘన్‌పూర్‌లో.. రజక సంఘం నాయకులు



పాలకుర్తి టౌన్‌లో.. సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రాజా, సాంబయ్య



రఘునాథపల్లిలో..



పాలకుర్తి: ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు




రఘునాథపల్లి: కోమళ్లలో..

విద్యార్థుల అభివృద్ధికి కృషిచేయాలి



నర్మెట : బోధనలో నూతన ఒరవడులను అవలంబిస్తూ విద్యార్థుల అభివృద్ధి ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని ఎంఈఓ మడిపల్లి ఐలయ్య అన్నారు. మల్కపేట ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులను అన్ని రంగాల్లో రాణించే విధంగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు నీలం వేణు, కీర్తి రమేష్, గోపాల్ రెడ్డి, మండల ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబురాలు



స్టేషన్‌ఘన్‌పూర్ : ఉపరాష్ట్రపతిగా ఎన్‌డీఏ అభ్యర్థి సీపీ రాధాక్రిష్ణన్ ఘన విజయం సాధించిన సందర్భంగా ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఉపరాష్ట్రపతిగా ఎన్‌డీఏ అభ్యర్థి విజయం సాధించడం హర్షణీయమన్నారు. అనంతరం పార్టీ శ్రేణులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రడపాక ప్రదీప్, నాయకులు కె.శరత్‌కుమార్, శివకృష్ణ, నాగేష్‌గౌడ్, కత్తి సందీప్, కవిత, రవి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



ఐలయ్య (ఫైల్)

కొడకండ్ల : మండలంలోని నర్సింగాపురం గ్రామశివారులో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై చింత రాజు తెలిపారు. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం కాన్వాయిగూడెం గ్రామానికి చెందిన రాసాని ఐలయ్య (30) ద్విచక్ర వాహనంపై నర్సింగాపురం గ్రామానికి వచ్చి తిరిగి వెళ్తూ కిందపడ్డాడు. దీంతో తలకు బలమైన గాయం కాగా వెంటనే వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విశ్రాంత ఉద్యోగి ..



మల్లయ్య (ఫైల్)

దేవరుప్పుల : మండలంలోని సింగరాజుపల్లికి చెందిన విశ్రాంత ఉద్యోగి, నాలుగో తరగతి యూనియన్ సీనియర్ నాయకుడు రచ్చ మల్లయ్య(74) బుధవారం మృతిచెందారు. మల్లయ్య మృతదేహానికి బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందర్‌రామిరెడ్డి తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మల్లయ్య కుమారుడు మాజీ సర్పంచ్ ఎల్లప్పను పరామర్శించారు.